క్లుప్తంగా

ఉపాధి వేతనాలు చెల్లించాలి

గార: ఉపాధి వేతనదారుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరావు సింహాచలం డిమాండ్ చేశారు. శుక్రవారం జొన్నలపాడు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆరు వారాలుగా వేతనాలు చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. అందరూ కూలీ డబ్బులపై బతికేవారని, వేతనాలు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 100 రోజులు పనులు పూర్తయిన వారిని ఆపివేయడం తగదని, పనులు లేక వలస బాట పట్టే అవకాశాలుంటాయని, అధికారులు దృష్టి సారించాలని కోరారు.

ఆదిత్యుని సన్నిధిలో కేంద్ర ఉన్నతాధికారి



ఎం.వి.రావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణని సెంట్రల్ సివిల్ సర్వీసెస్ జాయింట్ సెక్రటరీ ఎం.వి.రావు శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో ఎస్.చంద్రశేఖర్ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అర్చకులు ఇప్పిలి రంజిత్‌శర్మ ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు సాందీపశర్మ, ఫణీంద్రశర్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ప్రదర్శన

శ్రీకాకుళం అర్బన్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని గూనపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ బి.యోగీశ్వరి అన్నారు. నగరంలోని గూనపాలెం సెక్టార్ పరిధిలో పాత గూనపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ–పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పోషక విలువలుతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు టి.రాజేశ్వరి, బి.ఆదిలక్ష్మి, ఎ.హైమావతి, హెల్పర్లు మణి, పావని, ఆశావర్కర్ అమ్మాజీ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తనవంతుగా రూ. 20 వేల ఆర్థిక సాయం చేశారు. ఎస్సీ కాలనీ యువత కోరిక మేరకు తనవంతు సాయాన్ని గ్రామ పెద్దలకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రొక్కం బాలకృష్ణ, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

108లో ప్రసవం



పండంటి బిడ్డతో సిబ్బంది

గార: వమరవల్లి గ్రామానికి చెందిన నిండుగర్భిణి తిరుమలదేవి శుక్రవారం ప్రసవవేదనకు కుటుంబ సభ్యులు 108 అంబులెన్సుకు ఫోన్ చేశారు. సిబ్బంది సకాలంలో చేరుకుని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో పైలట్ ధర్మారావు, మెడికల్ టెక్నీషియన్ హరీష్ వాహనాన్ని నిలిపి సపర్యలు చేసి సుఖప్రసవం చేశారు. పండంటి పాప జన్మించడంతో తల్లిదండ్రులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

రామాయణ పారాయణ దీక్షలు ప్రారంభం



పారాయణ దీక్షల్లో భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండ రామాలయంలో శుక్రవారం శ్రీమద్రామాయణ పారాయణ మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో శ్రీరామ భక్త మండలి సభ్యులతో కలిసి పారాయణలు నిర్వహించారు. ఏప్రిల్ 23 వరకు పారాయణలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సువిశాలంగా పొట్టిశ్రీరాములు పెద్ద మార్కెట్



దారికొచ్చిన మార్కెట్!

- పొట్టి శ్రీరాములు పెద్దమార్కెట్‌లో తప్పిన ట్రాఫిక్ సమస్య
- కొనుగోలుదారులకు అనువుగా ఏర్పాట్లు
- క్రమబద్ధంగా తోపుడుబళ్లు, వాహనాల పార్కింగ్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద పొట్టి శ్రీరాములు పెద్దమార్కెట్ లోపలికి వెళ్లాలంటే నిన్నమొన్నటి వరకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. రోడ్డుపైనే తోపుడుబళ్లు, వినియోగదారుల వాహనాల పార్కింగ్ వల్ల కొనుగోలుదారులు అవస్థలు పడేవారు. ట్రాఫిక్ పోలీసుల పుణ్యమా అని ఆ ఇక్కట్లు తప్పాయి. ట్రాఫిక్ సీఐ అవతారం చొరవ తీసుకుని దుకాణదారులు, తోపుడు బండ్ల వ్యాపారులతో ఇటీవల సమావేశమయ్యారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తే కొనుగోలుదారులు రాక మరింత పెరిగి అధిక ఆదాయం సమకూరుతుందని నచ్చజెప్పడంతో వారంతా అంగీకరించారు. ఉదయం, రాత్రి వేళల్లో సీఐ ప్రత్యేక శ్రద్ధ పెట్టి మార్కెట్ నలువైపులా దుకాణదారుల ముందుండే తోపుడు బళ్లను, కొనుగోలుదారుల ద్విచక్ర వాహనాలను మధ్యలో పెట్టించారు. ద్విచక్ర వాహనాల కోసం వెడల్పుగా మార్గాలు చేశారు.అదే విధంగా, నిరంతరం ట్రాఫిక్ ఉండే పందుంబుళ్ల జంక్షన్ వద్ద పూల దుకాణాలను మార్చారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగడంతో కొనుగోలుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పాతబస్టాండ్ లోపలి నుంచి మార్కెట్‌లోకి వెళ్లే దారిలో సెంటర్ బైక్‌స్టాండింగ్



ఒకే వరుసలో ఉన్న తోపుడుబళ్లు

గతం కంటే బెటర్



గతంలో మా దుకాణం ముందు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, తోపుడుబళ్లు నిలిచిపోయి వ్యాపారానికి అంతరాయం కలిగించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎక్కడికక్కడ పేర్చినట్లు పోలీసులు చేయడంతో గతం కంటే బెటర్‌గా ఉంది.

– అనంత్‌బాబు, కూరగాయల వ్యాపారి

ఎవరికీ ఇబ్బంది లేకుండా..



దుకాణదారులు తమ ముందు చోటును ఆక్రమించడమే కాక వేరేవారెవరూ తమ దుకాణాల ముందు రాకుండా తోపుడు బళ్ల వారికి రెంట్‌కు ఇచ్చేవారు. ఈ ఇబ్బందిని గమనించి వారితో మాట్లాడంతో వారంతా సహకరించారు. కొనుగోలుదారులూ తమ వాహనాలను సెంటర్ పార్కింగ్‌లోనే ఉంచాలి.

– ఎం.అవతారం, ట్రాఫిక్ సీఐ

కత్తెర పురుగు నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

జి.సిగడాం: మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ డి.కిరణ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏ వై.సూర్యకుమారి, రణస్థలం ఏడీఏ వి. శ్రీనివాసరావు అన్నారు. దేవరవలస రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం రైతులతో అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. మొక్కజొన్న సాగులో సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాలన్నారు. రైతులు పంటలను సాగుచేసే ముందు వ్యవసాయ శాఖాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. మండల వ్యవసాయాధికారి యర్రా శారద, సెంట్రల్ బ్యాంకు మాజీ డైరెక్టర్ తిరుమరెడ్డి గౌరీశంకరావు, సర్పంచ్ తిరుమరెడ్డి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యుడు తిరుమరెడ్డి లక్ష్మణరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నారు.

సక్రమంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

జి.సిగడాం: ఎన్నికల విధులను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని మండల రిట్నరింగ్ అధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బూత్‌లెవల్ అధికారులంతా అంకితభావంతో పని చేయాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మల, గాయిత్రి, ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

‘నిబంధనల మేరకే జూట్‌మిల్ లాకౌట్’

శ్రీకాకుళం పాతబస్టాండ్: నీలమ్ జూట్ మిల్ ప్రయివేట్ లిమిటెడ్ పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయిందని, మిల్లు నిర్వహించడం సాధ్యం కాదని జనరల్ మేనేజర్ బి.ఎల్.ఈశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చాలా మంది కార్మికులు గైర్హాజరు కావడం, జూట్ పరిశ్రమ సంక్షోభంలో ఉండటం, ఉత్పత్తి తగ్గడం, కార్మికులు వైఫల్యం తదితర కారణాలతో లాకౌట్ విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. యూనియన్ నాయకులకు ముందుగా నోటీస్ ఇచ్చి న తరువాత నిబంధనల మేరకు మిల్‌ను లాకౌట్ చేశామని, ఈ విషయంలో కొందరు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

గ్రామీణ రహదారులకు పెద్దపీట



శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: గ్రామీణ రహదారులకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. దేవరవలస నుంచి గంగన్నదొరపాలెం వరకు 1.35 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో పీఏయూ ఏఈఈ పోలినాయుడు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం, సెంట్రల్ బ్యాంకు మాజీ డైరెక్టర్ తిరుమరెడ్డి గౌరీశంకరరావు, ఎంపీటీసీ సభ్యులు కుదిరెళ్ల గోవిందరావు, తిరుమరెడ్డి లక్ష్మణరావు, జక్కంపూడి దాస్, సర్పంచులు తొత్తడి రామారావు, బొల్లా జనార్దనరావు, రమణ, నారాయణరావు, శ్రీనివాసరావు ఉన్నారు.

మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్

శ్రీకాకుళం క్రైమ్ : తల్లిదండ్రుల బైక్‌లు తీసుకుని రహదారులపై వేగంగా వెళ్తున్న మైనర్లను ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం పట్టుకున్నారు. పిల్లల తల్లిదండ్రులను స్టేషన్‌కు రప్పించి కౌన్సిలింగ్ చేశారు. కౌమార దశలో ఉన్న బాలురు అతివేగంతో బళ్లను నడుపుతారని, ముగ్గురికి పైగా వెళ్తుంటారని, సరిగ్గా కంట్రోల్ చేసుకోలేక ఎదురుగా వచ్చేవారిని ఢీకొని వారి ప్రాణాలను హరించడమే కాక వీరూ ప్రాణాలు మీదకు తెచ్చుకుంటారన్నారు. వారికి బళ్లు ఇచ్చినందుకు పెద్దవాళ్లు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పట్టుబడిన 8 వాహనాలకు గాను ఒక్కోదానికి రూ. 535 చొప్పున జరిమానా విధించారు.

పిల్లలతో సహా వివాహిత అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఓ వివాహిత తన ఇద్దరి పిల్లలతో సహా అదృశ్యమైనట్లు శ్రీకాకుళ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. కింతలికి చెందిన యువతికి నగరంలోని ఎల్‌బీఎస్ కాలనీకి చెందిన రాజవర్ధన్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి పాప, బాబు ఉన్నారు. భార్యాభర్తలిద్దరికీ మనస్పర్థలుండటంతో తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పిల్లలతో కలిసి పార్క్‌కు వెళ్తానని వెళ్లిన వివాహిత రాత్రయినా ఇంటికి చేరలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ఎచ్చెర్ల క్యాంపస్: జరజాం గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయం నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకన్నబాబు

జి.సిగడాం: సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఎంపీడీవో వెంకన్నబాబు సూచించారు. ఎస్‌పీఆర్‌పురం గ్రామ సచివాలయంలో పని చేస్తున్న వివిధ శాఖల సిబ్బందితో శుక్రవారం మాట్లాడారు. గ్రామాభివృద్ధికి, ఎన్నికల ప్రక్రియపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి కూనిబిల్లి కోటేశ్వరరావు ఉన్నారు.

ముద్దాడలో వైద్య పరీక్షలు

ఎచ్చెర్ల: పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి ముద్దాడ గ్రామంలో వైద్యాధికారి ఎస్.శేషగిరి పర్యవేక్షణలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు చేశారు. 60 మందికి రక్తపరీక్షలు చేసినట్టు హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు తెలిపారు.

మోడల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



పతకాలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, సిబ్బంది

జి.సిగడాం: స్థానిక మోడల్ కళాశాల విద్యార్థులు ఒలిపియడ్ జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. గత ఏడాదిలో నిర్వహించిన పరీక్షల్లో భాగంగా లెక్కల విభాగంలో 20 మంది విద్యార్థులు హాజరవ్వగా ఎనిమిది మంది బంగారు, మరో ఎనిమిది మంది వెండి పతకాలు, సైన్స్ విభాగంలో 16 మంది బంగారు, వెండి పతకాలను దక్కించుకున్నారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లంక, అధ్యాపకులు మజ్జి ఈశ్వర్‌నాయుడు, చీరాపు రవికుమార్, పిచ్చిక నేతాజీ, జగేశ్వష్, ప్రమీల, జోత్స్న విద్యార్థులను అభినందించారు.

రెజ్లింగ్ క్రీడాకారుడికి అభినందన



ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ సీఎస్ఈ ద్వితీయ ఏడాది చదువుతున్న ఎండ శివచరణ్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ చంద్రశేఖర్‌తో కూడిన అధ్యాపకులు, మేనేజ్‌మెంట్ సభ్యులు అభినందించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

ఎచ్చెర్ల: లావేరు కోఆపరేటివ్ సొసైటీ ద్వారా వ్యవసాయ పంట రుణాలను పొందిన రైతులు మార్చి 20వ తేదీలోగా ఏడు శాతం వడ్డీ చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని పీఏసీఎస్ చైర్మన్ బూరాడ చిన్నారావు కోరారు. ఇలా చెల్లించని ఎడలా 13 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. రుణాలను చెల్లించాలనుకునే రైతులు 1బీ, ఆధార్‌కార్డు, తీసుకుని వచ్చి థంబ్ వేయాల్సి ఉంటుందని అన్నారు. సకాలంలో రుణములు చెల్లించిన రైతులకు రుణాన్ని పెంచుతామని చెప్పారు.

సీఎం జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం సాకారం

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాకారమైందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బంటుపల్లి గ్రామంలో రూ. 25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న కొద్దిరోజుల్లోనే రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డు, పింఛన్, కులధ్రువీకరణ పత్రాలను సచివాలయాల ద్వారా అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, జేసీఎస్ ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుల సంఘం మండల అధ్యక్షుడు మహంతి చినరామినాయుడు, బంటుపల్లి మాజీ సర్పంచ్ పాశపు ముకుంద, తిరుపతిపాలెం, బంటుపల్లి గ్రామ నాయకులు ఉన్నారు.

ప్రాణం విలువ గుర్తించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రవిశంకర్

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి వాహన చోదకుడు ప్రాణం విలువ గుర్తించాలని ఎన్ఐటీ వరంగల్ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీఆర్ రవిశంకర్ అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు సేఫ్టీ ఫోరం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు పవర్ ప్రజెంటేషన్ ద్వారా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న పొరపాటు ప్రణాలు తీస్తుందన్నారు. సీటు బెల్టు, హెల్మెట్ వినియోగం కీలకమన్నారు. డ్రంక్ డ్రైవ్‌కు యువత దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత, డ్రైవింగ్ నిబంధనలు పాటిస్తే 90 శాతం ప్రమాదాలు తగ్గుతాయని చెప్పారు. అతివేగం సైతం ప్రమాదకంగా వివరించారు. బైక్ ప్రమాదాల్లో ఎక్కువమంది యువకులు మృతి చెందుతున్నారన్నారు. అనంతరం కళాశాలలో రోడ్డు సెఫ్టీ క్లబ్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తి నాయుడు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజని



మాట్లాడుతున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: సైబర్ క్రైమ్‌పై ప్రజలకు, వస్తు సేవల వినియోగదారులకు అవగాహన అవసరమని బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంలో భాగంగా అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అండ్ అవేర్‌నెస్ (ఆశ్రా) సంస్థ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం, ఇంటర్నెట్ వినియోగం పెరగటంతో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. డిజిటల్ పేమెంట్లు, ఆన్‌లైన్ వ్యాపారాలు సాగుతున్న నేపథ్యంలో మోసగాళ్లు తప్పుడు వెబ్‌సైట్‌లు, యాప్‌లు, ఫోన్ కాల్స్ ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి సైతం సైబర్ నేరగాళ్లు సొమ్మును దోచుకుంటున్నారని అన్నారు. ప్రజల్లో పూర్తిస్థాయిలో బ్యాంకు సేవలపై, ప్రస్తుతం జరగుతున్న నేరాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ అక్కిరెడ్డి పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఆన్‌లైన్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సైబర్ క్రైమ్ సెల్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బాధితులు 1930కి ఫోన్ సమాచారం ద్వారా ఫిర్యాదు చేయాలని అన్నారు. న్యాయవాది ఇందిరా ప్రసాద్, ఆశ్రా అధ్యక్షులు డాక్టర్ గంజి ఇజ్రా, సభ్యులు కట్టా పార్థసారధి, సభ్యులు రవి కుమార్, లా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు వై.రాజేంద్ర ప్రసాద్, టి.బాలకృష్ణ, గజపతి జ్యోతిఫెడ్రిక్, అనిల్‌రాజ్, కొంక్యాన వేణు గోపాల్, కొంక్యాన మురళీధర్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సేవాదృక్పథం అవసరం



మాట్లాడుతున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో సేవాదృక్పథం అవసరమని బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. ధర్మవరం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం యూనిట్–2 ఆధ్వర్యంలో వారం రోజులు పాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులతో కలిసి ఇలాంటి శిబిరాలు నిర్వహించడం వల్ల గ్రామీణ సమస్యలు, ప్రగతి వారికి తెలుస్తాయని అన్నారు. భవిష్యత్‌లో వర్సిటీ ఆధ్వర్యంలో అన్ని విభాగాల విద్యార్థులు శిబిరాలు నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం.అనురాధ, పీవో తాతారావు, సర్పంచ్ అల్లు కన్నబాబు ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగం



బుడగుట్లపాలెంలో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించు కోవాలని జేఆర్‌పురం సీఐ జి.రామచంద్రరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కుప్పిలి, బుడగుట్లపాలెం గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌ను శుక్రవా రంనిర్వహించారు. కేంద్ర పోలీస్ బలగాలు వీధుల్లో ర్యాలీ చేశారు. ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా నచ్చిన వారికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార సంబరం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జి.సిగడాం: జి.సిగడాం అంగన్‌వాడీ కేంద్రం–2లో పౌష్టికాహర పక్షోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కె.లక్ష్మి మాట్లాడుతూ.. తల్లులు పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. ప్రభుత్వం పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారాన్ని అందిస్తోందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శిల్లా భారతి, వల్లూరు పైడితల్లి, ఆశ కార్యకర్త ముద్దాడ రాము, సీఎఫ్ అలపాన జయ ఉన్నారు.

గ్రావెల్ తవ్వకాలు నిలిపి వేయాలి



డీటీ బాలకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం పంచాయతీ నారాయణపురం భూముల్లో గ్రావెల్ తవ్వకాలు, తరలింపు నిలిపివేయాలని రైతులు కోరారు. ఎచ్చెర్ల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ సనలప బాలకృష్ణకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. జేసీబీలతో రాత్రి సమయంలో గ్రావెల్ తరలిస్తున్నారని అన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.